
# ఏజెంట్ X

యెదుళ్ల సురేష్ రెడ్డి

ఎథెల్ బంటీగీ




**అప్పటికి చాలాసేపటి నుండి అందు కోసమే ఎదురు చూస్తున్నట్టుగా కాలింగ్ బెల్ మ్రోగిన శబ్దం వినగానే కిటికీ ప్రక్కన సోఫాలో కూర్చుని ఏదో పుస్తకం చదువు కుంటున్న ఎథెల్ బంటీగీ త్వర త్వరగా వెళ్లి తలుపు తీసింది.**

**తలుపు ఎదురుగా నిలబడి ఉన్న ఫ్రెడరిక్ హగ్‌టన్ కన్పించాడామెకు, అతని ప్రక్కనే మరెవరో అపరిచిత వ్యక్తి నిలబడి ఉన్నాడు.**

"హాయ్ బంటీ..." అన్నాడు. హగ్‌టన్ లోపలి వచ్చాడు. "బైదిబై.... ఇతను అమెరికా రాయబార కార్యాలయపు అధికారి కమాండర్ అలెక్ జాన్సన్. నేను చెప్పింది ఇతని గురించే..." అంటూ తన వెంటవచ్చిన వ్యక్తిని ఆమెకు పరిచయం చేశాడతను.

చిరునవ్వుతో అతనితో కరచాలనం చేసి వారిద్దరినీ లోపలికి ఆహ్వానించింది ఎథెల్.

ముగ్గురూ డైనింగ్ టేబుల్ ముందుకు వెళ్లి కూర్చున్నారు. వారి ముందు ఉన్నప్లేట్లలో తను తయారు చేసిన పదార్థాల్ని వడ్డించింది ఎథెల్. వైన్ బాటిల్ని తెరిచి దాన్ని మూడు గ్లాసుల్లోకి వంపింది. మరో అయిదు నిముషాల్లో ముగ్గురూ సీరియస్‌గా చర్చల్లో మునిగిపోయారు.

"పోర్ట్‌లాండ్‌లోని సముద్రజల ఆయుధ వ్యవస్థకు సంబంధించిన కొన్ని రహస్యాలు ఇతనికి కావాలి ఎథెల్.. వాటిని మనమే సంపాదించాలి." అన్నాడు హగ్‌టన్.

"వాటిని మనం రహస్యంగా సేకరించి ఇతనికి ఇవ్వాల్సిన అవసరం ఏమిటి...? నిజానికి పోర్ట్‌లాండ్‌లోని సముద్రజల ఆయుధ వ్యవస్థకు చెందిన కార్యకలాపాలన్నీ అమెరికా, బ్రిటన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. అలాంటప్పుడు ఒక అమెరికా అధికారికి అక్కడి విషయాల్ని రహస్యంగా సంపాదించాల్సిన అవసరం ఏమిటి....?" అర్థంకానట్టుగా అడిగిందామె.

ఆ ప్రశ్నకు హగ్‌టన్ సమాధానం చెప్పేలోపే అలెక్ జాన్సన్ నోరు తెరిచాడు. "నిజానికి నువ్వన్నట్టు పోర్ట్‌లాండ్ సముద్రజల ఆయుధ వ్యవస్థలో జరుగుతున్న కార్యకలాపాలన్నీ అమెరికా, బ్రిటన్‌ల ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. కానీ ఈ మధ్య అమెరికాకు తెలియకుండా బ్రిటన్ అక్కడ మరేదో చేస్తోందని మా అనుమానం. ఆ రహస్యమేంటో తెలుసుకోవడం కోసమే అమెరికా ప్రభుత్వం నన్ను నియమించింది. నేను నేరుగా

ఈ విషయంలో జోక్యం చేసుకుంటే బ్రిటన్ ప్రభుత్వానికి అనుమానం కలిగే అవకాశం ఉంది. అందుకే మీ సహాయాన్ని కోరాను. అందులోనే పని చేస్తున్న మీకు అక్కడి రహస్యాల్ని సంపాదించటం చాలా సులభం. పైగా మీపైన ఎవరికీ అనుమానం కూడా రాదు. అంతకుమించి మీరు అందించిన రహస్యాలకు ప్రతిగా మీకు చాలా పెద్ద మొత్తంలో డబ్బు అందుతుంది. ఇలాంటి అవకాశం మీకు మళ్లీరాదు. ఆలోచించుకోండి" ఆశగా చెప్పాడతను.

మరికొద్ది సేపు చర్చల తరువాత హగ్టన్ సలహామేరకు అతను కోరిన విధంగా రహస్యాల్ని సంపాదించడానికి అంగీకరించింది ఎథెల్. డిన్నర్ పూర్తయిన తరువాత మరి కొద్దిసేపు అక్కడే కూర్చుని వెళ్లిపోయారు హగ్టన్, జాన్సన్‌లు.

హగ్టన్‌తో వచ్చినతని పేరు అలెక్ జాన్సన్ కాదనీ, అతను అమెరికా అధికారి కూడా కాదనీ, గార్డెన్ లాన్సడేల్ అన్నపేరు గల అతను కాకలు తీరిన రష్యా గూఢచారి అనీ, హగ్టన్‌కు ఆ విషయం తెలిసి కూడా తనతో అబద్ధం చెప్పాడనీ, తను సేకరించబోయే రహస్యాలన్నీ రష్యాకు చేరబోతున్నాయనీ ఆమెకు తెలియదు.

పోర్ట్‌లాండ్‌లోని అండర్‌వాటర్ ఎస్టాబ్లిష్ మెంట్‌లో పనిచేస్తున్న ఎథెల్ బంటీగీకి అక్కడి సీక్రెట్స్ తెలుసుకోవడం చాలా సులభమైన పని. ఆమె పనిచేసేది అందులోని రీసెర్చి విభాగంలో కాబట్టి చాలా రహస్యాలు ఆమెకు అందుబాటులో ఉండేవి.

హగ్టన్ సూచనల మేరకు మరొకరికి అనుమానం రాకుండా ఒక్కొక్కటిగా తనకు అందుబాటులో ఉన్న రహస్యాలన్నింటినీ కాపీ చేయడం ప్రారంభించిందామె. మరోవైపు అందులోనే పని చేస్తున్న ఎథెల్ ప్రియుడు హగ్టన్ కూడా అక్కడి రహస్యాల్ని సేకరించసాగాడు. ఇద్దరూ కలిసి అక్కడి అణుజలాంతర్గామి తయారీ గురించి, యుద్ధనౌకల గురించీ ఎంతో వర్తమానాన్ని కలిగి ఉన్న సీక్రెట్ డాక్యుమెంట్స్‌ని సంపాదించారు. తాము సేకరించిన రహస్య పత్రాలతో ఇద్దరూ లండన్ వెళ్లి అక్కడ లాన్స్‌డేల్‌కు వాటిని అందజేసేవారు. ఆ విధంగా కొన్ని సంవత్సరాల పాటు వారి గూఢచర్యం మూడోకంటికి తెలియకుండా కొనసాగింది.

**మార్చి 1960**

బ్రిటన్ గూఢచార సంస్థ ఎం.ఐ-6 హెడ్ క్వార్టర్స్‌లోని నాలుగో అంతస్థులో ఒక అత్యవసర సమావేశం జరుగుతోంది. ఎం.ఐ - 5 అసిస్టెంట్ డైరెక్టరు పీటర్ రైట్, ఎం.ఐ - 6 డైరెక్టరూ, సి.ఐ.ఏ అధికారి హారీ రామన్‌లతో పాటు మరెంతో మంది ఎం.ఐ.-5, ఎం.ఐ-6 ఉన్నతాధికారులు అక్కడ సమావేశమై ఉన్నారు.

అంతకుముందు రోజే పోలీస్ ఇంటిలిజెన్స్‌లో పనిచేసి అమెరికాకు వలసవచ్చిన మైఖేల్ గోలెనైవ్స్కీ అనే ఏజంటు ద్వారా సి.ఐ.ఏకు ఒక రహస్య సమాచారం అందింది. పోర్ట్‌లాండ్‌లోని అండర్ వాటర్ వెపెన్స్ ఎస్టాబ్లిష్మెంట్‌లో ఒక రష్యా గూఢచారి ఉన్నాడనీ, అతని పేరు హెచ్ అన్న అక్షరంతో మొదలవుతుందనీ, అతను అంత క్రితం వార్సాలోని బ్రిటిష్ ఎంబసీలో కూడా పనిచేశాడనీ ఆ వార్త సారాంశం.

ఆ విషయం తెలిసిన మరుక్షణమే సి.ఐ.ఏ అధికారులు బ్రిటన్ ఇంటిలిజెన్స్ వారితో సమావేశమై ఆ విషయాన్ని తెలియజేశారు.

సి.ఐ.ఏ అధికారి హారీ రామన్ ద్వారా ఎం.ఐ-5, ఎం.ఐ-6 అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. తమకు అందిన వివరాల ప్రకారం పోర్ట్‌లాండ్‌లోని అండర్‌వాటర్ వెవన్స్ ఎస్టాబ్లిష్మెంట్‌లోని రష్యా గూఢచారి గురించి తెలుసుకోవడానికి పరిశోధన ప్రారంభించిన వారికి ఒకే ఒక వ్యక్తి అనుమానితుడిగా కనిపించాడు.

అతను ఫ్రెడరిక్ హగ్టన్...

ఇరవై మూడు సంవత్సరాలపాటు రాయల్‌నేవీలో పనిచేసిన హగ్టన్ ఆ తరువాత వార్సాలోని బ్రిటన్ రాయబార కార్యాలయంలో ఉద్యోగంలో చేరాడు. అక్కడ అతను స్మగ్లింగ్ కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో అతన్ని తిరిగి ఇంగ్లాండ్ పంపించివేశారు. ఆ తరువాత అతను పోర్ట్‌లాండ్‌లోని బ్రిటిష్ అండర్ వాటర్ వెపన్స్ ఎస్టాబ్లిష్మెంట్‌లో చేరాడు. త్వరలోనే అక్కడే పని చేస్తున్న ఎథెల్ బంటీగీతో అతనికి పరిచయం ఏర్పడింది. ఆ తరువాత అది ప్రేమగా మారింది. ఈలోగా హగ్టన్ రష్యా గూఢచారిగా కొత్త అవతారాన్ని ఎత్తాడు. మరో రష్యా గూఢచారి గార్డెన్‌లాన్స్‌డేల్ ద్వారా తను సేకరించిన రహస్యాలన్నింటినీ రష్యాకు చేరవేసేవాడతను. లాన్స్‌డేల్‌ను అమెరికా రాయబార కార్యాలయపు అధికారిగా ఎథెల్‌కు పరిచయం చేసి ఆమె కూడా ఈ గూఢచర్యంలో పాలుపంచుకునేట్టు చేశాడు.

హగ్టన్ గురించిన వివరాల్ని సేకరించి మరుక్షణం ఎం.ఐ-5 ఏజెంట్లు హగ్టన్, ఎథెల్ బంటీగీలపైన నిఘావేశారు. అయినా కూడా వారిద్దరినీ గూఢచారులుగా నిరూపించే సాక్ష్యాల్ని సేకరించి రెడ్‌హాండెడ్‌గా పట్టుకోవడానికి ఎం.ఐ-5 ఏజంట్లకు దాదాపు రెండు సంవత్సరాలు పట్టింది. చివరికి 1962 ప్రారంభంలో లండన్‌లోని ఓల్డ్‌విక్ థియేటర్ దగ్గర లాన్స్‌డేల్‌కు రహస్యాల్ని అందజేసే ప్రయత్నంలో ఎథెల్, హగ్టన్‌లు రెడ్‌హాండెడ్‌గా పట్టుబడ్డారు. బ్రిటన్ యుద్ధ నౌకలకు చెందిన ఎన్నో ఫోటోలతో పాటు మరెన్నో రహస్య పత్రాలు కూడా వారి దగ్గర దొరికాయి.

వారు సాగించిన గూఢచర్య కలాపాలకు ప్రతిగా బ్రిటన్ ప్రభుత్వం ఎథెల్, హగ్టన్‌లకు పదిహేను సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అయితే పది సంవత్సరాల శిక్షాకాలం పూర్తి కాగానే వారిద్దరూ విడుదలయ్యారు.

తనను మోసం చేసి గూఢచార్యంలోకి దింపినందుకు హగ్టన్‌పైన ఏ మాత్రం కోపం తెచ్చుకోని ఎథెల్ అతనిపైన అంతులేని ఇష్టంతో జైలు నుండి విడుదలయ్యాక అతన్నే పెళ్లి చేసుకుంది. ●

